**ఇంటింటి కొకపూవు**

**ఈశ్వరునికొకమాల**

**శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి**

# విజ్ఞప్తి

గృహలక్ష్మి పాఠక సోదర సోదరీమణులారా!

1928 సంవత్సరము మార్చి ఒకటవ తేదీని గృహలక్ష్మి మాసపత్రిక ప్రారంభింపబడినది మొదలు నేను తమతో పరిచయము కలిగియున్నాను. ఈ పదిరెండు వత్సరములనుండియు నా రచనలు యెడతెగక గృహలక్ష్మిలో ప్రచురింపబడుటకు కారణము నా రచనలయెడలను నాయెడలను మీరు చూపుచున్న ప్రగాఢ ప్రేమయే. నేనీ సాహిత్య సేవతో తృప్తిచెంది యున్నచో నా జీవితము అపరిగ్రహవ్రత విశేషితమై యుండెడిదే. కాని తెలిసియో తెలియకయో నేను 1931 సంవత్సరములో నా జన్మస్థలమైన బాపట్ల పురమునందు మా పురస్త్రీల తోడ్పాటుతో 'స్త్రీ హితైషిణీ మండలి' అను స్త్రీ సమాజమును స్థాపించితిని. అదియు భగవదనుగ్రహమువలన దినదిన ప్రవర్థమానమై 1300 ల గ్రంథములు, పదిరెండు వార్తా పత్రికలుగల గ్రంథాలయ శాఖతోను, నవారు నేయుట, నూలువడుకుట చౌకములల్లుట మొదలగు పరిశ్రమలుగల గృహపరిశ్రమ శాఖతోను, బ్యాట్ మెంటెన్, రింగుటెన్నిస్, క్యారమ్స్, పిన్ బోర్డు డోమ్, చదరంగము ఆదిగాగల క్రీడా శాఖతోడను, స్త్రీ జన ప్రబోధకరములగు కరపత్ర ప్రచురణ శాఖతోడను, పండువులు, జయంతులు, వార్షికోత్సవములు మున్నగు ఉత్సవ కలాపములతోడను, మహనీయుల ఉపన్యాసములు, మహిళాసభలు మొదలగు ప్రత్యేక స్త్రీ సభలతోడను విరాజిల్లుచు గృహవసతికొఱకు నన్ను తొందరపెట్టుచున్నది.

గుంటూరుజిల్లాబోర్డు వారు మా విజ్ఞప్తిని మన్నించి మండలి భవననిర్మాణము నిమిత్తము దాదాపు వేయిగజముల నివేశన స్థలమిచ్చియున్నారు. అందు భవననిర్మాణము చేయవలసిన బాధ్యత నాపైబడినది. ఎచటనైన ఒక స్త్రీ సమాజము స్థాపింపబడి అదికొంచెము ఉన్నతికి వచ్చిన దనగనే దానికి గృహావరణాది సౌకర్యములు కావలసివచ్చుటయు, ధన సంపాదనా సౌకర్యములు లేని స్త్రీలు అందుకు సమర్థలు కాక పోవుటయు, అంతటితో నా సమాజకార్యములు నిలిచిపోవుటయు మనదేశమున జరుగుచున్న విషయమేగదా? నన్నుగూడ యీ చిక్కు ఇప్పుడెదుర్కొనినది కాన నా పుస్తకములను కొనుక్కొనుటకైన నొకరిని ప్రార్థించి యెఱుగని నేను యీ మండలికొఱకు పరుల నర్థించవలసివచ్చినది. అయినను 'పరహితరతమతి యుతులగు దొరలకు నడుగుటలు నొదలి తొడవులు పుడమిన్' అను భాగవతసూక్తి ప్రకారము పరార్థ కార్యమగుట అపరిచితులగు మిమ్ము అరవిడిచి తోడ్పడ కోరదలంచితిని.

ఇంటింటి కొకపూవు యీశ్వరునకొకమాల, యనిసామ్యముగదా. మీలోఒక్కొక్కరు యథాశక్తి ఒక్కొక్కరూకగా సహాయమొనర్చినను శ్రమలేకయే నా సంకల్పము ఫలించును. కావున రాష్ట్ర రాష్ట్రేతరాంధ్రసోదర సోదరీమణులెల్లరు నాజీవితములో ఒక్కగా నొక్కమారు స్త్రీ జనోపయోగకరసంస్థకై కోరిన యీ అత్యల్ప సహాయమును మనఃపూర్వకముగా నొనర్చి నాకృతజ్ఞతాభి వందనములకు పాత్రులు కావలయునని వినయ పూర్వకముగా ప్రార్థించుచున్నాను. మా భవన నిర్మాణనిధికి చందానీయనెంచినవారు 'కనుపర్తి వరలక్ష్మమ్మ, శక్రటరీ, స్త్రీహితైషిణీమండలి, బాపట్ల (గుంటూరుజిల్లా)' అను విలాసమునకు మనియార్డరు ద్వారగాని పోస్టలుఆర్డరుగాగాని పంపవచ్చును తామేగాక యితరులవల్లగూడా నాకు సహాయము చేయ నెంచిన ఉదారహృదయులు నాకుతెలియబరిచినచో తమ యూరికినేను స్వయముగావచ్చి తమ సహాయమును వందనములతో స్వీకరింపగలను.

బాపట్ల,
12–10–40.

ఇట్లు, మీ ప్రేమాస్పదురాలగు సోదరి,
కనుపర్తి వరలక్ష్మమ్మ.